క్లుప్తంగా

దేశమ్మ ఆలయానికి హుండీ సమర్పణ

నగరి: నేత్ర ప్రదాయిని దేశమ్మ దేవత ఆలయానికి నగరికి చెందిన అన్నామలై మెటల్ స్టోర్స్ నిర్వాహకులు లోకనాథన్ రూ. 15 వేల విలువ చేసే హుండీని సమర్పించారు. ఆదివారం ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన హుండీని ఉత్సవ కమిటీ సభ్యులు మదన్‌కుమార్, వెంకటాచలం సుబ్బయ్య, ఆలయ అర్చకులు పురుషోత్తం సమక్షంలో ఆలయానికి అందజేశారు. ఆలయ పూజారులు దాతల పేరిట అర్చనలు చేసి ప్రసాదాలు అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ


షకీలా, ఏఎస్‌డబ్ల్యూఓ

గంగాధర నెల్లూరు : టెట్‌లో అర్హత సాధించిన ఎస్సీ , ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇప్పించనున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ షకీల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అర్హులైన అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 27న స్క్రీనింగ్ టెస్ట్ చేపట్టి మెరిట్ ప్రకారం ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. అలాగే ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలని వెల్లడించారు.

వైభవంగా మహా కుంభాభిషేకం


పూజలు చేస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు : మండలంలోని వింజం పంచాయతీ కృష్ణం పల్లెలో పోలు వంశస్తులు నిర్మించిన అంకాల పరమేశ్వరి సమేత బాల గురునాథ స్వామి ఆలయ మహా కుంభాషేకాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకను పురోహితుడు అనంతశయనం అయ్యంగార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ క్రమంలో సోమవారం ఊరేగింపు, అన్నదానం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వీఆర్‌ఏ డివిజన్ కమిటీ నియామకం


మాట్లాడుతున్న వీఆర్‌ఏ సంఘ నాయకులు

కార్వేటినగరం : నగరి డివిజన్ వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీని సంఘం జిల్లా నాయకులు కోదండన్, లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం నియమించారు. నూతన అధ్యక్షుడు ఆర్.లోకనాథం మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్హత మేరకు వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలని, పనికి తగ్గ వేతాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు టి.వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి బాబు, కోశాధికారి హరి, ఉప కోశాధికారి టి.జగన్నాథం, టి.పాండురంగం పాల్గొన్నారు.

నిరక్షరాస్యత రూపుమాపుదాం


పలకలు అందజేస్తున్న తియో స్టీఫెన్

శ్రీరంగరాజపురం: నిరక్షరాస్యత రూపుమాపడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రిడ్స్ సామాజిక సేవా సంస్థ చైర్మన్ తియో స్టీఫెన్ తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో పెద్దతయ్యూరు దళితవాడలోని మహిళలకు చదువు నేర్పుతున్న రాత్రి పాఠశాలకు పలకలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదమ్మ, సంస్థ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయిని స్వర్ణకుమారి, పాస్టర్ తులసిమణి, రవి, నాని, కుప్పయ్య పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాకు పుణ్యతిథి పూజలు

నగరి: పట్టణంలో బేరివీధిలోని షిరిడి సాయి బాబా ఆలయంలో శనివారం పుణ్యతిథి పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. విజయ దశమి రోజున సాయినాథుడు సమాధి కావడాన్ని పురస్కరించుకుని ఈ పూజలు చేశారు. సాయినాథుని ప్రతిమకు ప్రత్యేక అభిషేకాలు, పుష్పార్చన చేసి అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు లాయర్ మురళీధర్, లీలావతి, సావిత్రమ్మ, భాస్కర్ ఆచ్చారి తదితరులు పాల్గొన్నారు.

చెంగారెడ్డి కుటుంబానికి పరామర్శ

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లంలో వస్త్ర వ్యాపారి చెంగారెడ్డి కర్మక్రియలకు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరయ్యారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రామయ్య, గోవిందయ్య, శివాజీ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ..?


పచ్చికాపల్లంలో రోడ్డుపైనే విద్యార్థుల పడిగాపులు, వెదురుకుప్పంలో రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్న బస్సులు

గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తాం...పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కలిస్తాం...అభివృద్ధి ఏమిటో చేతల్లో చూపిస్తాం-' ఇదీ ఎన్నికల సమయంలో కూటమి నేతలు నియోజకవర్గ ప్రజలకు ఊదరగొట్టి గుప్పించిన హామీలు. కూటమి నేతల హామీల మాట అటుంచితే ఎన్నో ఏళ్లుగా బస్టాండ్లు లేక రోడ్లపైనే పడిగాపులు కాస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రయాణికులకు నిలువ నీడ కల్పించిన పాపానపోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

- బస్టాండ్ లేక ప్రయాణికులు పాట్లు
- రోడ్లపైనే పడిగాపులు

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ కేంద్రంతోపాటు తక్కిన మండలాలైన కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, పెనుమూరు, పాలసముద్రంలో ఎక్కడా బస్టాండ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరంగరాజపురంలో బస్టాండు ఉన్నా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రధానంగా వెదురుకుప్పం మండలంలో ప్రయాణికుల పరిస్థితి దయనీయంగా ఉంది. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రధానన రహదారులపై గంటల తరబడీ నిరీక్షించాల్సి వస్తోంది.

వెదురుకుప్పం మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో మొత్తం 226 గ్రామాలు ఉన్నాయి. 46853 మంది జనాభా ఉంది. మండల ప్రజలు దూర ప్రాంతాలైన తిరుపతి, చిత్తూరు, పుత్తూరు ప్రాంతాలకు వెళ్లాలంటే వెదురుకుప్పం, పచ్చికాపల్లం ప్రాంతాలకు వచ్చి బస్సులను ఎక్కాల్సి వస్తోంది. మండల కేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఎక్కువగా వస్తూంటారు. అలాగే, చవటగుంటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఐటీఐలు ఉన్నాయి. రోజూ విద్యార్థులు వస్తుంటారు. ఇక్కడ ప్రతి మంగళవారం వారతపు సంత జరుగుతోంది. సుమారు 40 గ్రామాలకు సంబంధించి ప్రజలు సంతలో కూరగాయలు కొనేందుకు వస్తుంటారు. బస్టాండ్ లేక ఇక్కట్లకు గురవుతున్నారు. ఇక, మండలంలోనే పచ్చికాపల్లం వాణిజ్యపరంగా వృద్ధి చెందుతోంది. సుమారు 50 గ్రామాల ప్రజలు వివిధ లావాదేవీల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు.. ప్రతి ఆదివారం వారపు సంత జరుగుతోంది. ఇక్కడ కూడా బస్టాండ లేకపోవడంతో గంటల తరబడీ బస్సుల కోసం రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులైతే వారి బాధలు చెప్పనలవి కాదు.

రోడ్లపైనే పార్కింగ్

వెదురుకుప్పం మండల కేంద్రంలో బస్టాండ్ లేదు. ఇక్కడ చిత్తూరు, తిరుపతి, పుత్తూరు మార్గాలకు ప్రధాన కూడలి. చిత్తూరు-2, తిరుపతి, పుత్తూరు డిపోల బస్సులు తిరుగుతున్నాయి. నిత్యం వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. చిత్తూరు-2 డిపో బస్సులు మాత్రమే షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ప్రధాన రహదారిపై నిలుపుతున్నారు. అయితే అరగంటకు పైగా నిలిపి ఉంచడంతో ఎండాకాలంలో చమటలు కక్కాల్సిందే. ప్రధానంగా వైద్యం కోసం తిరుపతికి ఇక్కడి నుంచి ఎక్కువగా బస్సులకు వెళ్తుంటారు. ఎండవేడిమికి అవస్థలు పడుతున్నారు.

ట్రాఫిక్ సమస్య జఠిలం

వెదురుకుప్పంలో మూడు ప్రాంతాల నుంచి బస్సులు ఒకేసారి రావడం, ప్రధాన రహదారిపైనే వాటిని నిలిపేస్తుండడంతో మూడు మార్గాల నుంచి వచ్చే వాహనాలు వైదొలగేందుకు ఫీట్లు చేయాల్సి వస్తోంది. ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక, వాహనాలను దుకాణాలకు ఎదురుగా నిలుపుతుండడంతో ఆటోలను తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని డ్రైవర్లు వాపోతున్నారు. ట్రాఫిక్ సమస్యలతో ప్రతి మంగళవారం జరిగే వారపు సంత రోజు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పోలీసులు దీనిని పట్టించుకోవడం లేదు.

బస్టాండ్ కట్టేదెన్నడో?

బస్టాండ్ లేకపోవడంతో బస్సులు వచ్చేంత వరకు రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. అంగళ్ల దగ్గర కూర్చుంటే వ్యాపారులు కసురుకుంటున్నారు. వర్షం వస్తే ఇక అంతే. ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఎండా కాలంలో అయితే పరిస్థితి మరీ కష్టం. అదే బస్టాండ్ ఉంటే ఎన్ని గంటలైనా ఉంటా కదా! రోడ్లపై నిలబడాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. బస్టాండ్ కట్టేదెన్నడో..?– సుబ్బమ్మ, నల్లవెంగనపల్లె

అధికారులు స్పందించాలి

బస్టాండ్ కట్టమని కోరుతున్నా ఫలితం శూన్యం. ప్రధాన రహదారులపైనే బస్సులను నిలిపి ఉంచడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పైగా ట్రాఫిక్ సమస్య పీడిస్తోంది. కాంప్లెక్స్, 108 కేంద్రం ఎదురుగా వాహనాలను నిలిపేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అద్దెబస్సులు నడిపే డ్రైవర్లు వాహనాలకు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వెదురుకుప్పంలో బస్టాండ్ కట్టాలని కోరినా ప్రయోజనం లేకపోయింది. – శిల్ప, సర్పంచ్, వెదురుకుప్పం.

హుషారుగా ఎడ్లపందేలు



దూసుకుపోతున్న కోడె గిత్తలు


కోడె గిత్తను పందేనికి ఉసిగొల్పుతున్న నిర్వాహకులు


పలక పట్టిన ఆనందంతో బొమ్మన్‌దొడ్డ యూత్

వెదురుకుప్పం : కోడె గిత్తల జోరు.. యువత కేరింతలు.. అరుపులు కేకలతో ఆదివారం మండలంలోని చింతలగుంట ఎస్సీ కాలనీ మార్మోగింది. దసరా సంబరాలను పురస్కరించుకుని హుషారుగా ఎడ్లపందేలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత యువకులు చేరుకుని అల్లి వద్ద పలకల దక్కించుకునేందుకు పోటీపడ్డారు. పలకలు దక్కించుకున్న వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

పుష్పపల్లకీ సేవ



నగరి: మున్సిపల్ పరిధి సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరివరదరాజస్వామి ఆలయంలో శనివారం పుష్పపల్లకీ సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. పెరటాశి శనివారం, విజయదశమి కలసి రావడంతో ఆలయంలో పూజలు పెద్ద ఎత్తున పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత కరి వరదరాజస్వామి తిరు మాడావీధులలో విహరించారు. కోలాటాలు పండరి భజనలు డప్పు వాయిద్యాలు, గోవింద నామ స్మరణతో గ్రామ వీధులు మార్మోగాయి. ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేశారు. టీటీడీ శ్రీ కోదండ రామస్వామి అనుబంధ ఆలయాల సహాయ కార్యనిర్వహణాధికారి బి.రవి, అధ్యక్షులు బి.సోమశేఖర్, పుష్పపల్లకీ విరాళ దాతలు వీకే ఏకనాథం, వీకే దయానిధి, అన్నదాన దాత వి.నాగభూషణం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ


నాగమ్మ పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధర నెల్లూరు : నియోజకవర్గంలోని ఇరువురు వైఎస్సార్‌సీపీ నేతలను మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం వారి గ్రామాలకు వెళ్లి పరామర్శించారు. వివరాలు.. వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి వీరక నెల్లూరు కోదండన్ తల్లి నాగమ్మ అనారోగ్యంతో ఉండడంతో వారి నివాసానికి మాజీ డిప్యూటీ సీఎం వెళ్లారు. వారి ఆరోగ్యస్థితిగతులు తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యులు ఇందిరా, మణి, సాల్మోను పాల్గొన్నారు.

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మునస్వామి నాయుడు సతీమణి రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం గ్రామానికి వెళ్లి రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, పార్టీ మండల కన్వీనర్ తులసి యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, సర్పంచ్ గాలి మహేష్, నాయకులు సుందరరాజు, పుత్తూరు కేశవరెడ్డి, పోలయ్య, గురుప్రసాద్, షణ్ముగరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పుత్తూరు: పదహారేళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులందరూ మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. ఆదివారం వడమాలపేట జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులతో కళకళలాడింది. 2007-08లో 10వ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాల పూదోటలో విహరించారు. తమ ఉన్నతికి బాటలు వేసిన అప్పటి ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఉపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి, శ్రీహరి, నాగయ్య, దుర్గాభాయ్, నసీమాను గజ పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వారి ఆశీస్సులు పొందారు. విశ్రాంత హెచ్‌ఎం వేణుగోపాల్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మంచి సమాజం ఆవిర్భవిస్తుందన్నారు. తమ పూర్వ విద్యార్థులు వివిధ స్థానాల్లో స్థిరపడి ఉండటం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చైతన్య, పురంధర్, సురేష్, అశ్విని, జీవిత, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అలంకరణలో ఒన్నూరమ్మ, రాజరాజేశ్వరి అలంకరణలో దేశమ్మ దేవత, మహిషాసురమర్దినిగా కామాక్షి, నింద్ర: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో.., బుగ్గ దేవాలయంలో హోమపూజలు.. ప్రత్యేక అలంకరణలో ఓంశక్తి







భక్తిప్రపత్తులతో విజయదశమి


గెరిగ ఊరేగింపు


వెదురుకుప్పం: పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు

నగరి : విజయదశమి వేడుకలు మున్సిపల్, మండలంలోని పలు ఆలయాల్లో శనివారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు.అలాగే ఆయుధ పూజను ప్రతి దుకాణం, కార్యాలయాల వద్ద చేశారు. ఆయుధ పూజకు అవసరమైన గుమ్మడికాయలు, బొరుగులు, అరటి పిలకలు, పూజాసామగ్రి విక్రయాలు బాగా సాగాయి. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమ్మవార్లకు చేసిన అలంకరణలు భక్తులను అమితంగా ఆకట్టుకుంది. బుగ్గ అగ్రహారం ఒన్నూరమ్మ దేవాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో, టీఆర్ కండ్రిగలోని నేత్రప్రదాయిని దేశమ్మ దేవత రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో మహా చండీయాగం చేశారు. పట్టణంలోని కరకంతేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారు మహిషాసుర మర్ధిని, టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

నింద్రలో..

నింద్ర: మండల వ్యాప్తంగా శనివారం విజయదశమి పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కేఆర్ పాళెంలోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

వైభవం.. దశమి సంబరం

కార్వేటినగరం : నవరాత్రి వేడుకల్లో భాగంగా చివరి రోజు శనివారం విజయదశమి సంబరాలు వైభవంగా నిర్వహించారు. స్కంధ పుష్కరిణి సమీపంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి, సంస్థానాధీశుల వంశస్తులు విష్ణువర్ధన్‌రాజుతో పాటు ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చందన అలంకరణలో బాటగంగమ్మ

బాటగంగమ్మ అమ్మవారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో కన్నప్ప కుటుంబ సభ్యులు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలత్తూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి ఊరేగించారు. బంగారమ్మ ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

ఎస్‌ఆర్‌పురంలో..

శ్రీరంగరాజపురం : నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరిపించారు. అంకనపల్లె, ఆరిమాకులపల్లె, చేకురివారి ఇండ్లు, గంగమ్మ గుడి గ్రామాలవాసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ తిమ్మారెడ్డి, ధర్మకర్త లింగారెడ్డి పర్యవేక్షించారు.

ఎల్లమ్మ గ్రామోత్సవం

గంగాధర నెల్లూరు : దసరా మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు విజయ దశమిని పురస్కరించుకుని అల్లి ఎల్లమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారు పుట్టిన తోపు నుంచి గెరిగను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. దాదాపు 1000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త పార్థసారథిరెడ్డి, నిర్వాహకులు గుణశేఖర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని మిద్దినత్తంలో వెలసిన పడవేటమ్మ తల్లిని రాజరాజేశ్వరి అలంకారంతో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

తిరుపతి గంగమ్మకు నైవేద్యం

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ దాసరి కాలనీలో ఉన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అలాగే డీఆర్‌ఎస్‌కండ్రిగ, చవటగుంట ఆలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా చేపట్టారు.







కార్వేటినగరంలో ఊరేగుతున్న రాజరాజేశ్వరీదేవి, చందన అలంకరణలో బాటగంగమ్మ, ఆలత్తూరులో ఊరేగుతున్న ముత్యాలమ్మ, విశేషాలకారంలో అల్లి ఎల్లమ్మ, ఊరేగుతున్న పడవేటమ్మ తల్లి, రాజరాజేశ్వరి అలంకారంలో పడవేటమ్మ